క్లుప్తంగా

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

పూసపాటిరేగ: మండలంలోని కొణతాలపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి గోపి దంపతులు తమ సొంత నిధులు రూ.2 లక్షలతో పైప్‌లైన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు కొంతకాలంగా తాగునీటికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో గోపి దంపతులు సొంత నిధులతో పైప్‌లైన్లు వేసేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో రమణ, రామసూరితో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన



పాడిరైతుకు బహుమతి అందజేస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖాధికారి రమణ

భోగాపురం: మండలంలోని రావాడ గ్రామంలో కృత్రిమ గర్భాధారణ ద్వారా జన్మించిన 57 ఆడ లేగదూడల ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి వై.వి.రమణ, సర్పంచ్ ఎ.పైడినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అందం, ఆరోగ్యంలో మేలైన దూడలు కలిగిన పాడిరైతులు అవనాపు వెంకటరమణకు ప్రథమ బహుమతి, దంతులూరి రావాడ బాబుకు ద్వితీయ బహుమతి, దంతులూరి సూర్యనారాయణరాజుకు తృతీయ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ డివిజినల్ డీడీ రామచంద్రరావు, ఏడీ ఉమాశంకర్ పాత్రో, జిల్లా పశుగణన అభివృద్ధి అధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే



అలుగోలు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్: పక్కాగా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే చేయాలని ఎంపీడీఓ గిరిబాల సూచించారు. శుక్రవారం మండలంలోని అలుగోలు, గుషిణి గ్రామ సచివాలయాలను సందర్శించిన ఆమె రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల పనితీరు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వలంటీర్ల సమన్వయంతో సిబ్బంది త్వరితగతిన సిటిజన్ ఔట్ రీచ్ సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

గజలక్ష్మికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్ శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో గజలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస రమేష్ ఆచార్యుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

- గ్రామీణ వైద్యుల సంఘ అధ్యక్షుడు గద్దె చిరంజీవి



రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చిరంజీవి, గోపాలరావు

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ వైద్యుల సంఘం, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మే 1న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని గ్రామీణ వైద్యుల సంఘ అధ్యక్షుడు గద్దె చిరంజీవి, మాతృభూమి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గోపాలరావు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామీణ వైద్యుల సంఘం కార్యాలయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు బి. రామకృష్ణారావు జాతీయ స్థాయి రికార్డు కోసం 175వ సారి రక్తదానం చేయనున్నారని తెలిపారు. యువత రక్తదానానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాగేశ్వరావు, ఆదినారాయణ, ఇజ్రాయిల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన ర్యాలీ



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

డెంకాడ: మండలంలోని అమకాం పంచాయతీ పరిధిలోని వెంకటన్నపేటలో చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వ్యాధులపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా మిమ్స్ వైద్యుల సహకారంతో వైద్యశిబిరం నిర్వహించి, సుమారు 110 మంది రోగులకు వైద్య సేవలందించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.షణ్ముఖరావు, వలంటీర్లుమ పాల్గొన్నారు.

రూ.60 లక్షలతో పైప్‌లైన్లు..

- దాసన్నపేట వాటర్ ట్యాంక్ నుంచి నీరు మళ్లించేందుకు త్వరలో శంకుస్థాపన
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని రాజీవ్‌నగర్ కాలనీలో మంచినీటి సమస్య తీర్చేందుకు రూ. 60 లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేసి, దాసన్నపేట వాటర్ ట్యాంక్ నుంచి నీటిని సరఫరా చేయనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. 28వ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సాగుతోందన్నారు. ఇదే పరిస్థితుల్లో మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ పార్టీపరంగా కూడా ఇంటింటికీ వెళ్లే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టడం జరుగుతోందని చెప్పారు. ప్రజలందరూ ఎంతో సంతోషంగా జగనన్న స్టిక్కర్లను వారి ఇళ్ల గోడలకు అతికించుకుంటున్నారని తెలిపారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి తగ్గ తనయుడిగా జగన్ మోహన్‌రెడ్డి మంచి పేరు తెచ్చుకుని, సంక్షేమ పాలన అందిస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

ప్లానింగ్ సెక్రటరీ పనితీరుపై అసంతృప్తి..

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న స్థానిక ప్లానింగ్ సెక్రటరీని సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కోలగట్ల ఆదేశించారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సహించబోమన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సలహా మండలి డైరెక్టర్ ఎస్. బంగారునాయుడు, స్థానిక కార్పొరేటర్ జకీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

మూడు కేంద్రాల్లో నవోదయ ప్రవేశ పరీక్ష



నెల్లిమర్ల బాలికోన్నత పాఠశాల

నెల్లిమర్ల: నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్షను నెల్లిమర్ల పట్టణంలోని మూడు కేంద్రాల్లో శనివారం నిర్వహించనున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రెల్లివీధి బాలికోన్నత పాఠశాలతో పాటు వేణుగోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 144 మంది చొప్పున, గురుకుల పాఠశాలలో 145 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

- ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ అనూషారెడ్డి

భోగాపురం: అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేసేందుకు మే 3వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆమె కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. మండలంలోని 22 పంచాయతీల నుంచి దాదాపు 15 వేల మంది సభకు హాజరుకానున్నారని, ఈ నేపథ్యంలో దానికి తగ్గట్లు ఏర్పాట్లు ఉండాలని ఆమె సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.బంగారయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యు.సూర్యనారాయణ రెడ్డి, ఏరియా కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, తదితరులు

డెంకాడ: మండలంలోని సింగవరంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పూజలు చేశారు. వీరితో పాటు సర్పంచ్ పిట్టా పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మూడు రోజులుగా గ్రామస్తులు, భక్తులు వివిధ రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన స్వీకరించారు.

మానవ జన్మ ఉత్కృష్టమైనది..



ప్రసంగిస్తున్న ఆధ్యాత్మికవేత్త కోదండ రామయ్య

నెల్లిమర్ల: అన్ని జన్మల్లోనూ మానవ జన్మ ఉత్కృష్టమైనదని.. ప్రతి ఒక్కరూ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చిట్టేట కోదండరామయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో శుక్రవారం నిర్వహించిన విమలాంబ పోలుబోతు ఈశ్వరీమాత వార్షికారాధన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్సంగ సభలో కోదండరామయ్య మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నేను, నాది అనే అహం విడిచిపెట్టాలని సూచించారు. మానవత్వంతో ప్రవర్తించి ఇతరులను ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలుబోతు రామారావు, గంజి శ్రీను, శ్రవణ చైతన్య చిన్నస్వామి, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సంక్షేమ పథకాలపై ఆరాతీస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: ఏమమ్మా మీకు పింఛన్ వస్తోందా... చేయూత వస్తోందా.. మీ పిల్లలకు అమ్మఒడి డబ్బులు పడ్డాయా... గ్రామాల్లో పాఠశాలల రూపురేఖలు మారాయా... విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా... జగన్ మోహన్‌రెడ్డి పాలన బాగుందా..? మీకు ఏ సమస్య వచ్చినా మా పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అందుబాటులో ఉంటున్నారా..? అని ఎమ్మెల్యే కోలగట్ల వీరభ్రద్రస్వామి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని గుంకలాంలో నాలుగో రోజైన శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను తీసుకున్నారు. అనంతరం వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, సర్పంచ్ కునుకు వెంకటరావు, పార్టీ సీనియర్ నాయకులు లెంక జగ్గునాయుడు, బాబ్జీ, సత్తిబాబు, తదితరులు మాట్లాడుతూ, గుంకలాం గ్రామం ఆనాడు దివంగత నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనూ, మరలా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయంలోనే అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. రెండు సమయాల్లోనూ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామి తమ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. పారదర్శక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమంతా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల శాఖ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- సమస్యలు పరిష్కరించాలని ఛైర్‌పర్సన్‌కు సభ్యుల వినతి



సమావేశంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్, తదితరులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీవేడిగా జరిగింది. సమావేశంలో తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను ఛైర్‌పర్సన్ దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. వీధిలైట్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పలు వార్డుల్లో లైట్లు వెలగడం లేదని పలువురు సభ్యులు ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి నగర పంచాయతీ మేనేజరు విశ్వేశ్వరరావు స్పందిస్తూ వీధిలైట్ల నిర్వహణ కాంట్రాక్ట్ మార్చి నెలాఖరుతో ముగిసిందని చెప్పగా.. నిర్వహణకు అవసరమైన మెటీరియల్‌ను వెంటనే కొనుగోలు చేసి, సమస్యను పరిష్కరించాలని ఛైర్‌పర్సన్ ఆదేశించారు. పలు ప్రాంతాల్లోని తాగునీటి బోర్లు పాడవ్వడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని సభ్యులు తెలిపారు. దీనికి ఛైర్‌పర్సన్ స్పందిస్తూ, వెంటనే బోర్లకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే టెండర్లు పిలిచిన 16వ వార్డు సీసీ రోడ్డుతో పాటు 7, 8 వార్డులకు సంబంధించిన శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. కో ఆప్షన్ సభ్యుడు చిక్కాల సాంబశివరావు స్పందిస్తూ, వెంటనే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు ఫోన్‌లో ఆదేశించారు. పట్టణంలో చేపట్టనున్న సమగ్ర భూ సర్వేకు సభ్యులు సహకరించాలని అధికారులు కోరారు. పట్టణ పరిధిలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో గతంలో పట్టాలు పొంది, తాజాగా ఇళ్ల నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్లు అవసరమైన వారికి వెంటనే మంజూరు చేసేలా కౌన్సిల్‌లో తీర్మానించారు. అలాగే రెల్లివీధిలో కల్వర్టు, శ్రీరామ్‌నగర్ కాలనీలో సిమెంట్ కాలువ, 20వ వార్డులో కాలువపై పలకల నిర్మాణానికి రూ. 33 వేల చొప్పున మొత్తం 99 వేల రూపాయల సాధారణ నిధుల నుంచి మంజూరు చేయడానికి సభ్యులు అంగీకరించారు. అలాగే ఎల్ఈడీ లైట్ల నిర్వహణ, కొత్తవి కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉన్న ఎస్ఎఫ్‌సీ నిధులు రూ. 4 లక్షలు వినియోగించడానికి సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో వైస్‌ఛైర్మన్లు కారుకొండ వెంకట కృష్ణారావు, సముద్రపు రామారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం పూల్‌బాగ్: టెక్నికల్ సర్టిఫికెట్ 42 రోజుల సమ్మర్ ట్రైనింగ్ కోర్స్-2023లో చేరేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులకు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురంలో మే నెల 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 29 నుంచి మే 6వ తేదీలోగా www.breap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 18 సంవత్సరాల నిండినవారై, పదవతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలన్నారు. టీసీసీ లోయర్‌గ్రేడ్ పాసైన వారు అర్హులని పేర్కొన్నారు.

నిజమైన కమ్యూనిస్ట్‌గా తీర్చిదిద్దేది మార్క్సిజమే..

విజయనగరం పూల్‌బాగ్: నిజమైన కమ్యునిస్టుగా తీర్చిదిద్దేది మార్క్సిజమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన సమావేశంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకుని 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామేశ్వరరావును ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శి బుగత అశోక్, సభ్యులు ఎస్. రంగరాజు, బుగత పావని, బాయి రవణమ్మ, మద్ది కృష్ణ, ఎస్.నాగభూషణం, పి. అప్పలరాజు, పురం అప్పారావు, కె. స్రవంతి, కె.దేముడు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పూసపాటిరేగ: చింతపల్లిలో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, తదితరులు



నెల్లిమర్లలో స్టిక్కర్ అతికిస్తున్న చిక్కాల, తదితరులు

పూసపాటిరేగ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చింతపల్లిలో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, బర్రి చినఅప్పన్న, సర్పంచ్ బర్రి మొసలి పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమం

నెల్లిమర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు సంక్షేమం అందుతోందని నెల్లిమర్ల నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పట్టణంలోని 10వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కుటుంబ యజమానుల అనుమతితో గోడలకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్, నాయకులు నల్లి శ్రీనివాసరావు, తుమ్ము నారాయణమూర్తి, బంగారు శంకరరావు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత మాదే..

- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాల్లో 41 అంశాలకు ఆమోదం
- రూ.60 కోట్లతో టీఆర్‌టీఎస్ నుంచి నగరానికి నీటి సరఫరా: కమిషనర్



హాజరైన కార్పొరేటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని... 2019 ఎన్నికలకు ముందు టీడీపీ హయాంలో వారానికొకసారి నీటిని సరఫరా చేస్తే, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముందుస్తు ఆలోచనలతో నాలుగేళ్లుగా రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అన్నారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. సాధారణ సమావేశంలో 32 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టగా రెండింటిని తిరస్కరించిన కౌన్సిల్.. 30 అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అదేవిధంగా అత్యవసర సమావేశంలో 11 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టగా... సభ్యులంతా వాటిని ఆమోదించారు. బీపీఎస్ గ్రాంట్ నిధులతో వివిధ ప్రాంతాల్లో 56 అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.4.60 కోట్లు మంజూరు చేశారు. ముందుగా సాధారణ సమావేశంలోని అంశాలను ప్రస్తావిస్తున్న సమయంలో ప్రతిపక్ష టీడీపీకి చెందిన కార్పొరేటర్ కర్రోతు రాధామణి నగరంలో ఒక్క నూతన తాగునీటి ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని, గతంలో టీడీపీ హయంలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలే ఇప్పటికీ ప్రజలకు నీరందిస్తున్నాయన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఘాటుగా స్పందించారు. అప్పట్లో మీరు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేశారని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానంటూ కార్పొరేటర్ సుంకరి నారాయణస్వామి బదులిచ్చారు. మరో కార్పొరేటర్ అల్లు చాణక్య మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయంలో నగర ప్రజలకు రూ.200కే తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని మోసం చేసిన విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. 2019 ఎన్నికలకు ముందు వేలాది మంది ప్రజలు తాగునీరు కోసం మున్సిపల్ కార్యాలయం ఎదుట బిందెలతో నిరసన చేపట్టిన విషయం గుర్తులేదా అని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయం ఆసన్నమవుతున్న తరుణంలో అర్థంలేని ఆరోపణలు చేయడం తగదన్నారు. మరో కార్పొరేటర్ కడియాల రామకృష్ణ మాట్లాడుతూ, టీడీపీ నేతలకు నగరంలో మంచినీటి సరఫరాపై మాట్లాడే హక్కు లేదన్నారు. కార్పొరేటర్ కంటుభుక్త తవిటరాజు మాట్లాడుతూ, సుదీర్ఘకాలం నియోజకవర్గాన్ని పాలించిన టీడీపీ నేతలు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వనరులు పెపొందించుకోవడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. తమ పార్టీని ప్రమోట్ చేసుకోవడానికి నగరంలో జరుగుతున్న అభివృద్ధిపై అబద్ధపు ప్రకటనలు చేయడం తగదన్నారు.

నగరాభివృద్ధికి కృషి..

సమష్టి సహకారంతో నగరాభివృద్దే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరంలో నీటి పంపిణీ విషయమై ఈఈ కె. శ్రీనివాసరావు సమాధానమిస్తూ అమృత్ పథకం కింద నగరంలోని వివిధ ప్రాంతాల్లో వాటర్ ట్యాంక్‌లను నిర్మించడం జరిగిందన్నారు. కోఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు మాట్లాడుతూ, నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 2019 నుంచి శాసనసభ్యుడిగా గెలుపొందిన కోలగట్ల వీరభద్ర స్వామి నగరంలో వార్డు పర్యటనలు చేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారని చెప్పారు. కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వీయ పర్యవేక్షణలో నగరాభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. కౌన్సిల్ సభ్యుల సహకారం, సిబ్బంది కృషి ఫలితంగా నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటివరకు రూ. 35 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.45 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నగర ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు రూ.60 కోట్ల వ్యయంతో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని మళ్లించేందుకు అవసరమైన నిధులు మంజూరయ్యాయని, ఆ పనులు పూర్తయితే ప్రతిరోజూ నగర ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటివరకు 585 ఇంటర్ కనెక్షలను ఏర్పాటు చేసి అవసరమైన వారందరికీ కుళాయిల ద్వారా నీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీపీ రాజేష్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మే 1న వాహనం వేలం

విజయనగరం క్రైమ్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో-1 స్టేషన్‌లో మే ఒకటో తేదీన ఓ కేసులో పట్టుబడిన వాహనాన్ని వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి.మధుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఈబీ సూపరింటెండెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు నేరుగా పాల్గొనాలని కోరారు.

బీసీలకు రాజ్యాధికారమే అజెండా..



మాట్లాడుతున్న స్టేట్ కన్వీనర్ బోను దుర్గా నరేష్, తదితరులు

విజయనగరం పూల్‌బాగ్: బీసీలకు రాజ్యాధికారం సాధించడమే అజెండా అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ కన్వీనర్ బోను దుర్గానరేష్ అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యకు రాజ్యసభ సీటు ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు అండగా నిలిచారన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘ కన్వీనర్‌గా బొద్దాన అప్పారావును నియమించామని, త్వరలోనే విజయనగరంలో కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ పిల్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్, జిల్లా ప్రధాన అప్పారావు, గువ్వల తిరుపతిరావు, సప్ప ప్రసాద్, రెడ్డి సంక్షేమ సంఘం డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, రాంప్రసాద్, బాలి ప్రతాప్, ప్రసాద్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.